ప్రజాశక్తి

మంగళవారం 3 డిసెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అమరావతి అభివృద్ధికి వేగంగా అడుగులు



సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

- రాజధాని గ్రామాల్లో పనులకు సిఆర్‌డిఎ ఆమోదం
- త్వరలో ప్రారంభం కానున్న టెండర్ల ప్రక్రియ
- మూడేళ్లలో పూర్తికి కార్యాచరణ ప్రణాళిక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులపై ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సిఎం చంద్రబాబు నాయుడు, మునిసిపల్ మంత్రి పి.నారాయణ ఎప్పటికప్పుడు పలు అంశాలపై సమీక్షించి కీలక పనులకు ఆమోదం తెలుపుతున్నారు. ఈ మేరకు సోమవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఎ సమావేశంలో అమరావతిలో కీలక పనులకు టెండర్లు పిలిచేందుకు ఆమోదం తెలిపారు. మొత్తం రూ.11,467 కోట్లతో చేపట్టనున్న పనులకు త్వరలో టెండర్లు పిలవాని సిఎం ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న భవన సముదాయాల నిర్మాణాలు పూర్తి చేయడం, మాస్టర్‌ప్లాన్ ద్వారా మౌలిక వసతులను కల్పించేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రూ.2498 కోట్లతో సీడ్ కేపిటల్‌లో నిర్మించే 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్ల నిర్మాణం చేస్తారు. రాజధాని గ్రామాల్లో ముంపు నివారణకు రూ.1585 కోట్లతో పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్‌తో పాటు రిజర్వాయర్లు నిర్మిస్తారు. గెజిటెడ్, నాన్ గెజిటెడ్, క్లాస్-4, అల్ ఇండియా సర్వీస్ అధికారుల భవనాలు పనులను రూ.3523 కోట్లతో చేపట్టనున్నారు.

రైతులకు ఇచ్చిన రిటర్ణబుల్ లే అవుట్ లలో రోడ్లు,మౌళిక వసతుల కల్పనకు రూ.3859 కోట్లకు అనుమతిచ్చారు. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టకు అథారిటీ ఆమోదం తెలిపిందని ఈ నెలాఖరులోగా టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ఆయా పనులను జనవరి నుంచి ప్రారంభిస్తామని మంత్రి నారాయణ మీడియాకు తెలిపారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని 5 ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు డిజైన్లకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఈనెల 15 కల్లా డిజైన్లు ఖరారు చేయనున్నారు. 2019లో అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో భాగంగా మధ్యలో నిలిచిపోయిన గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్-1, టైప్-2, క్లాస్-4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్స్ పూర్తికి 594.54 కోట్లను కేటాయించారు. మొత్తం 1440 అపార్ట్‌మెంట్‌ల పెండింగ్ పనులు పూర్తికి ఈ నిధులు ఖర్చు చేస్తారు. నిర్మాణంలో 12 అంతస్తులతో కూడిన మొత్తం 14 టవర్ల నిర్మాణంకు రూ.785 కోట్లు కేటాయించగా 2019 మే వరకు రూ.408.63 కోట్ల వరకు పనులు జరిగాయని అంచనా వేశారు. గెజిటెడ్ ఆఫీసర్ల గృహ సముదాయం వద్ద మౌళిక వసతుల కల్పనపనులను రూ.226.26 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల ఇళ్లకు మిగిలిన పనులను పూర్తి చేయడానికి రూ.607.50 కోట్లతో ఆమోదం తెలిపారు. మొత్తం 9 టవర్లు, సిల్ట్ ప్లస్ 12 అంతస్థులు తో మొత్తం 855 ఫ్లాట్లు నిర్మాణం పూర్తిచేస్తారు. ఆలిండియా సర్వీస్ అధికారులు (ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు)కు 115 బంగ్లాల పెండింగ్ పనులను రూ.516.6 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. రైతులకు కేటాయించిన ▸ 2లో



చేబ్రోలు, నరసరావుపేటలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు.. వెనక మాస్కుల్లో నిందితులు

ఒడిశా నుండి వచ్చి.. గంజాయి తెచ్చి..

- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నలుగురు అరెస్టు
- 4 కిలోలకుపైగా సరుకు, 400 మత్తు బిళ్లల స్వాధీనం

ప్రజాశక్తి - చేబ్రోలు, పల్నాడు జిల్లా

విద్యార్థులకు, యువకులకు, స్పిన్నింగ్ మిల్లుల్లో కూలీలకు గంజాయి విక్రయిస్తున్న ఒడిశాకు చెందిన నలుగుర్ని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుండి 4 కిలోలకు పైగా సరుకును, 400 మత్తు చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ముగ్గుర్ని గుంటూరు జిల్లా చేబ్రోలు పోలీసులు, ఒకర్ని పల్నాడు జిల్లా నరసరావుపేట ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను ఆయా స్టేషన్‌లలో పోలీసులు సోమవారం వెల్లడించారు.

చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో తెనాలి డీఎస్పీ బి.జనార్ధన్‌రావు వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన హదానంద దాస్, ప్రసన్న రౌత్రే, కేంద్రపారా అక్కడి నుండి గంజాయిని తెచ్చి చిన్నచిన్న పొట్లాలుగా చేసి చేబ్రోలు, తెనాలి పరిసరాల్లో యువకులు, స్పిన్నింగ్ మిల్లుల్లోని కూలీలకు మద్యవర్తుల ద్వారా అమ్ముతున్నారు. ఈ క్రమంలో సోమవారం చేబ్రోలు మండలం నారాకోడూరు పరిధిలని కామధేను పీడ్స్ వద్ద




నారాకోడూరులో స్వాధీనం చేసుకున్న గంజాయి

గంజాయి సంచులతో ఉండగా డీఎస్పీతోపాటు పొన్నూరు రూరల్ సిఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి.వెంకటకృష్ణ, సిబ్బంది దాడి చేశారు. పోలీసులను గమనించిన నిందితులు పారిపోతుండగా వారిని పట్టుకుని వారి వద్ద 4.2 కిలోల సరుకుని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కొద్దిరోజుల క్రితం ఒడిస్సాలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి నుండి 4.2 గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి రైలు, రోడ్డు మార్గాల ద్వారా నారాకోడూరుకు తెచ్చారని, దీన్ని దీపక్ అనే వ్యక్తి దగ్గర ఉంచి ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు వాటాలు వేసుకుని ▸ 2లో

బతికే ఉన్నా చంపేశారు..!

- కొడుకు ఖాతాలో బీమా సొమ్ము జమ
- పింఛను నిలిచిపోయిందని ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి

ప్రజాశక్తి - వినుకొండ



శేషమ్మ చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్న రికార్డు

అధికారులు తలుచుకుంటే చనిపోయిన వారిని బతికున్నట్లు.. బతికున్న వారిని చనిపోయినట్లు చేయగలరు... అనడానికి వినుకొండలో జరిగిన సంఘటన నిదర్శనంగా నిలుస్తోంది. ఒ మహిళ బతికే ఉన్నా ఆమె చనిపోయినట్లు నమోదు చేయడమే కాకుండా ఏకంగా ప్రమాద బీమా వర్తింపజేసి నామిని బ్యాంకు ఖాతాకు రూ.90 వేలు చేశారు. 15 ఏళ్లుగా ఆమెకు వస్తున్న సామాజిక పింఛనును నిలిపేశారు. వివరాల ప్రకారం...



బాధితురాలు శేషమ్మ

పట్టణంలోని ఒకటో వార్డు సీతయ్య నగర్‌కు చెందిన వల్లెపు శేషమ్మ 15 ఏళ్లగా వితంతు పింఛను తీసుకుంటున్నారు. నవంబర్ నెల పింఛను ఆగిపోవడంతో మరుసటి రోజు ఆమె తన కుమారుడు శ్రీకాంత్‌ను తీసుకుని స్థానిక సచివాలయానికి వెళ్లారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సమస్య చెప్పగా ఆయన వివరాలను పరిశీలించి ఆన్‌లైన్ జాబితాలో చనిపోయినట్లు నమోదైందని, అందుకు పింఛను రాలేదని చెప్పారు. ఈ ఏడాది జనవరిలో సచివాలయ ఉద్యోగి తమ ఇంటికి వచ్చి కుమారుడు శ్రీకాంత్‌తో బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు తీసుకున్నారని, అ తర్వాత అక్టోబర్ వరకూ పింఛను వచ్చిందని బాధితురాలు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదునూ సచివాలయంలో ఇచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ▸ 2లో

రహదారిపై డ్వాక్రా మహిళల బైఠాయింపు

- విఒఎ తొలగింపు, రికార్డుల నిర్వహణ తీరుపై ఆగ్రహం
- మహిళలపై అట్రాసిటీ కేసు పెట్టాలని ఎపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తమ అనుమతి లేకుండా విఒఎ (డ్వాక్రా యానిమేటర్)ను మార్చడంతోపాటు దీనిపై ఫిర్యాదులు ఇస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహానికి గురయ్యారు. మండలంలోని గొట్టిపాడుకు చెందిన మహిళలు నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో ప్రధాన రహదారనిపై కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. దీనిపై మహిళల వివరాల ప్రకారం...



రహదారిపై నిరసన తెలుపుతున్న గొట్టిపాడుకు చెందిన డ్వాక్రా మహిళలు

గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామ సమైక్యకు చెందిన మహిళలు కొద్దిరోజులు తమ విఒఎను తొలగించారని ఫిర్యాదు చేయడానికి సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. దీనిపై వారి వాదనలు వినేందుకు వెలుగు ఎపిఎం లాజర్ తన కార్యాలయం నుండి వచ్చి మాట్లాడుతున్నారు. ఆయనపై మహిళలు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రాజెక్టు డైరెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదని పైగా కొత్త విఒఎను ఎందుకు పెట్టుకున్నారని, తమ సంతకాలు లేకుండా ఇవన్నీ ఎలా చేశారని నిలదీశారు. వీటికి సరైన సమాధానం ఇవ్వకుండా ఎపిఎం కార్యాలయంలోకి వెళ్తుండగా మహిళలు అడ్డుకోబోయారు. అయినా ఆయన పట్టించుకోకుండా గ్రీవెన్స్ ఉందంటూ వెళ్లిపోగా ఆగ్రహానికి గురైన మహిళలు అక్కడే ప్రధాన రహదారిపై బైఠాయించారు. విఒఎల విషయంలో ఇష్టానుసారం వ్యవహరిస్తున్న ఎపిఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విఒఎల ▸ 2లో


ఎపిఎంను నిలదీస్తున్న మహిళలు

రహదారిపై డ్వాక్రా మహిళల బైఠాయింపు

(మొదటి పేజీ తరువాయి)

చెక్‌బుక్‌లను, బ్యాంకు పాస్‌బుక్‌లైను సైతం ఆయన స్వాధీనం చేసుకుని ఇతరులకు ఇస్తున్నారని ఆరోపించారు. ఇది తెలిసిన ఎస్ఐ నాగేంద్ర అక్కడికి చేరుకున్నారు. ఎపిఎంను పిలిపించి మహిళల ద్వారా అర్జీని ఇప్పించారు. తమ విఒఎను తొలగించి మరోకరికి ఆ బాధ్యతలు అప్పగించారని, ఆమెపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ఆమెకు తమ గ్రూపు బాధ్యతలు అప్పజెప్పొద్దని మహిళలు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా తొలుత మహిళలు వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్లిపోతున్న ఎపిఎంను మహిళలు అడ్డుకున్న సందర్భాన్ని పేర్కొంటూ తనను వారు కొట్టే ప్రయత్నం చేశారని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎస్ఐకు ఎపిఎం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం గమనార్హం.

బతికే ఉన్నా చంపేశారు..!

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టి బతికున్న శేషమ్మను చూసి అవాక్కయ్యారు. ప్రమాద బీమా సొమ్ము జమవడంపై ఆరా తీయగా ఆమె కుమారుడు వివరణ ఇచ్చారు.. తనకు జనవరిలోనే రూ.90 వేలు జమయ్యాయని, అవి ఎక్కడివో తెలియక సచివాలయ ఉద్యోగులను సంప్రదించగా వ్యాపారం నిమిత్తం ప్రభుత్వ పథకం నుండి డబ్బులు పడ్డాయని చెప్పారన్నారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ సుబాష్‌చంద్ర బోస్‌ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని, వారి సూచనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా బీమా సొమ్మును తమకు ఇస్తే కంపెనీకి చెల్లిస్తామని బాధితురాలిని సచివాలయ ఉద్యోగులు ఒత్తిడి చేస్తున్నారు. అయితే అందుకు వారు అంగీకరించడం లేదు. తమకు ఏ ఖాతా నుండి నగదు జమయ్యాయో ఆ ఖాతాదార్లనే సంప్రదించి చెల్లిస్తామని చెబుతున్నారు.

ఒడిస్సా నుండి వచ్చి.. గంజాయి తెచ్చి..

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముకుంటున్నారని పోలీసుల విచారణలో తేలింది. నరసరావుపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సాకు చెందిన ఉదయానంద్ అనే వ్యక్తి మండలంలోని కోటప్పకొండ సమీపంలోని ఈటి గ్రామంలో చిన్న బడ్డీని నడుపుతున్నాడు. ఒడిస్సా నుండి గంజాయిని, మత్తు చాక్లెట్లను తీసుకొచ్చాడు. చాక్లెట్లతోపాటు గంజాయిని 10 గ్రాముల ప్యాకెట్‌గా చేసి ప్యాకెట్ రూ.200 చొప్పున రిక్షాపుల్లర్లు, కార్మికులు, కాలేజీ, పాఠశాల విద్యార్థులకు అమ్ముతున్నాడు. ఆయుర్వేద చాక్లెట్లంటూ సెవెన్‌మీనార్ పేరుతో మత్తు బిళ్లలను విద్యార్థులకు అమ్ముతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం బడ్డీకొట్టులో తనిఖీలు చేసి 170 గ్రాముల గంజాయి, 400 మత్తు బిళ్లలను స్వాధీనం చేసుకుని నిందితుణ్ణి అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎఇఎస్ కె.రవీంద్ర, సిఐ సోమయ్య పాల్గొన్నారు.

ఇసుక రవాణాలో అన్యాయం

పోలీసు గ్రీవెన్సులో టిప్పర్స్ యజమానుల ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


ఇసుక రవాణాలో తనకు అన్యాయం జరుగుతోందని టిప్పర్‌ల ఓనర్స్ అసోసియేషన్ సోమవారం గ్రీవెన్సులో జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసింది. అసోసియేషన్ నాయకులు ఎన్.ఫణికుమార్, శ్రీనివాసు, కె.వెంకటేష్, ఎల్. వెంకటేశ్వరరావులు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొంత మంది సామాన్య ప్రజల ముసుగులో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అనధికారిక వాహనాలను నియంత్రించాలని కోరారు. ఎంతో కాలంగా తాము ఇసుక రవాణా చేస్తుండగా తమను కాదని ఇతర వాహనాల ద్వారా రవాణా జరుగుతుందని వారు ఆరోపించారు. పోలీసు అధికారిని అని నమ్మించి మోసం చేసి తరువాత తీవ్రంగా వేధిస్తున్నాడని పాత గుంటూరు జియాఉద్దీన్ నగర్ కు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ప్రైవేటు నర్సింగ్ హోంలో పనిచేస్తుండగా తెనాలికి చెందిన జంధ్యాల సాయితేజ ఎస్ఐనని చెప్పి తనతో పరిచయం పెట్టుకుని మోసం చేశారని తెలిపారు. వెంగళాయపాలెం వైసిపి నాయకుడు నాగేశ్వరరావు నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ కందుల స్వరాజ్య లక్ష్మీ ఫిర్యాదు చేశారు. సంబంధిత ఫిర్యాదులపై పోలీసు అధికారులు ఆయా పోలీసు స్టేషన్‌కు దర్యాప్తు నిమిత్తం ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు పరిష్కారాల వ్యవస్థ జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, అదనపు ఎస్‌పి రమణమూర్తి తదితరులు ప్రజల నుంచి అర్జిలను స్వీకరించారు. వృద్దులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదుల పట్ల శ్రద్ధ వహించి, చట్ట పరిధిలో వారి ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్‌పి తెలిపారు. ఫిర్యాదు దారుల నుండి కుటుంబ సమస్యలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన కేసులకు సంబంధించి ఫిర్యాదులు అందగా, వాటిని చట్ట పరిధిలో పరిష్కరించమని సంబంధిత పోలీస్ స్టేషన్ పంపామని తెలిపారు. వృద్ధులు, నడవలేని వారి వద్దకు స్వయంగా వెళ్లి ఫిర్యాదులు తీసుకుని, వారి సమస్యలు ఆలకించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు.


వీల్ చైర్‌లో వచ్చిన వృద్దురాలి నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న అదనపు ఎస్‌పి రమణమూర్తి

ఎపిఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్‌వర్కర్స్ ఫెడరేషన్

వ్యవస్థాపక నేత అంకమరావు కన్నుమూత

ప్రజాశక్తి-తెనాలిరూరల్



ఎపిఎస్ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సీనియర్ నాయకులు పెద్దిశెట్టి అంకమరావు(90) సోమవారం తెనాలిలో కన్నుమూశారు. అంకమరావు ఆర్టీసీ ఉద్యోగిగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ బాధ్యతలతో పాటు వామపక్ష ఉద్యమంలో కూడా చాలా క్రియాశీలకంగా పని చేశారని నాయకులు తెలిపారు. తుది శ్వాస విడిచే వరకు వామపక్ష ఉద్యమం, సిఐటియు విధానాలకు కట్టుబడి నిజాయితీగా పనిచేశారని తెలిపారు. వారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, నాయకులు కొల్లిపర బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, పి జోనేష్, ఆర్టిసి విశ్రాంత ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు కె శివ శంకరరావు, ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు జోహార్లు అర్పించారు.


అంకమరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మతి స్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణ సమీపంలో లలితాదేవి కాలనీ వద్ద ఆదివారం రూరల్ ఎస్సై సి.హెచ్ కిషోర్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న 22 ఏళ్ల యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. మాట్లాడలేని స్థితిలో ఉన్న యువకుడిని సంరక్షించారు. మాట్లాడలేని ఆ యువకుడు పేపర్ పై కుటుంబ సభ్యుల ఫోన్ నెం. రాయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా పాకం గ్రామానికి చెందిన వ్యక్తిగా నిర్ధారణ అయింది. తెలిసింది. 20 రోజుల క్రితం యువకుని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం తిరువల్లూరు హాస్పటల్ కు తప్పిపోయి నరసరావుపేట చేరుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. సోమవారం తమిళనాడు నుండి వచ్చిన తండ్రి సోదరునికి యువకుడిని పోలీసులు అప్పగించారు. యువకుని కుటుంబ సభ్యులు పోలీసులకు కతజ్ఞతలు తెలిపారు.కుమారుడు తప్పి పోవడంతో తమిళనాడు పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశామని తమిళనాడులో చుట్టుపక్కల ప్రాంతాలలో వెతుకుతున్నామని పోలీసులకు చెప్పారు. ఎస్.పి కె.శ్రీనివాసరావు, డి.ఎస్.పి కె.నాగేశ్వరరావు, రూరల్ సిఐ పి. రామకష్ణ ఎస్.ఐ కిషోర్ నుఅభినందించారు.


యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్.ఐ సిహెచ్ కిషోర్

అమరావతి అభివృద్ధికి వేగంగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

భూముల్లో మొత్తం 8496.30 ఎకరాల్లో మౌలిక వసతులను రూ.3859.66 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. నెక్కల్లు, అనంతవరం, శాఖమూరు, నేలపాడు, తుళ్లూరు, అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి, కొండమరాజుపాలెం తదితర గ్రామాల్లో రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లుకు అభివృద్ధికి ఈ నిధులు ఖర్చుచేస్తారు. అమరావతిలో హ్యాపీ నెస్ట్ ప్రాజెక్ట్ చేపట్టేందుకు సవరించిన అంచనాలు రూ.984.10 కోట్లకుకు ఆమోదం తెలిపారు. ప్రపంచ బ్యాంకు, ఎసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల నుంచి అమరావతిలోని వరద నివారణ పనులు రూ.1585.95 కోట్లతో మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఎన్-9 రోడ్డు వెంబడి రోడ్లు,తాగునీరు,వరద నీటి కాల్వలు, యుటిలిటీ డక్ట్స్, పాదచారుల ట్రాక్‌లు, సైకిల్ ట్రాక్‌లు, ఎవెన్యూ ప్లాంటేషన్, స్ట్రీట్ ఫర్నీచర్ కోసం రూ.522.39 కోట్లను వరల్డ్ బ్యాంకు, ఎసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధుల నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఎన్-15 రోడ్డు వెంబడి రోడ్లు, తాగునీరు, వరద నీటి కాల్వలు, యుటిలిటీ డక్ట్స్, పాదచారుల ట్రాక్‌లు, సైకిల్ ట్రాక్‌లు, ఎవెన్యూ ప్లాంటేషన్, స్ట్రీట్ ఫర్నీచర్ కోసం రూ.482.01 కోట్లను వరల్డ్ బ్యాంకు, ఎసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధుల నుంచి ఖర్చు పెట్టేందుకు అనుమతించారు. ఎన్-6 రోడ్డుకు ప్యాకేజి-7 కింద మిగిలిపోయిన నిర్మాణ పనులకు మౌలిక వసతులు కల్పించేందుకు 452.96 కోట్లకు ఆమోదం తెలిపారు. కేపిటల్ సిటీలో ప్యాకేజి-8 కింద మిగిలిపోయిన నిర్మాణ పనుల మౌలిక వసతులు కల్పించేందుకు 522.92 కోట్లకు ఆమోదం తెలిపారు.

వైసిపి నాయకులపై పవన్ కళ్యాణ్ ఆరోపణలు తగదు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్ట్ నుంచి అక్రమంగా రేషన్ బియ్యం ఇతర దేశాలకు ఏగుమతి జరుగుతుందని దీనికి కారణం వైసిపి నాయకులని ఆరోపించడం తగదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేటలో సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 7 నెలల పాలనలో అధికారులను మార్చుకొని పని చేయుచుకుంటున్నప్పటికీ వైసిపి నేతలపై నిందలేంటని ప్రశ్నించారు. బియ్యం పోర్టు నుంచి విదేశాలకు వెళుతున్నాయని ఆరోపిస్తున్నారని అసలు పోర్టు దాకా ఈ బియ్యం ఎలా వస్తున్నాయి, ఏయే జిల్లాల నుంచి వస్తున్నాయే పౌర సరఫరాల శాఖ, పోలీస్ వ్యవస్థ నిగ్గు తేల్చాలన్నారు. అధికార పార్టీ నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని అనవసర ఆరోపణలు సమంజసం కాదన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రేషన్ మాఫియా వ్యవహారం మొత్తం తెలుసన్నారు. చిత్తశుద్ధి ఉంటే కింద స్థాయి నుంచి ఈ అక్రమ రవాణా ఆపి కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాస రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పచ్చవ రవీంద్ర బాబు, నాయకులు పడాల చక్రారెడ్డి, పొనుగోటి వెంకటరావు పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో వర్సిటీ క్రీడాకారునికి కాంస్య పతకం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగు తున్న అంతర విశ్వవిద్యాలయాల సౌత్ వెస్ట్ జోన్ పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మూడవరోజు వర్సిటీ క్రీడాకారుడు కాంస్య పతకం సాధించాడు. మూడో రోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పాల్ కుమార్ వెల్లడించారు. 96 కేజీల కేటగిరిలో మధురై కామరాజ్ యూనివర్సిటీ క్రీడాకారుడు అశ్లీన్ 300 కేజీల బరువులు ఎత్తి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. తిరువల్లూరు యూనివర్సిటీ క్రీడాకారుడు జె.దీర్షన్ 298 కేజీల కేటగిరీలో వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. నాగార్జున యూనివర్సిటీ క్రీడాకారుడు ఎ.అరునేష్ బాబు 297 కిలోల కేటగిరీలో కాంస్య పతకం సాధించాడు. 102 కేజీల విభాగంలో సావిత్రిబాయి పూలే యూనివర్సిటీ క్రీడాకారుడు వైష్ణవ్ సాహసి ఠాకూర్ 321 కేజీల బరువులెత్తి బంగారు పతకాన్ని గెలుపొందాడు. బెంగళూరు సిటీ యూనివర్సిటీకి చెందిన క్రీడాకారుడు 311 కిలోల విభాగంలో రజత పతకాన్ని సాధించాడు. కొలహపూర్ శివాజీ యూనివర్సిటీ క్రీడాకారుడు రాజేంద్ర 306 కిలోల విభాగంలో కాంస్య పతకం దక్కించుకున్నాడు.

నేటితో ముగింపు

అంతర విశ్వవిద్యాలయాల పురు షుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు మంగళవారంతో ముగు స్తాయని ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు.

15 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రధానమంత్రి అవాస్ యోజన ద్వారా రాష్ట్రంలో లక్ష ఇళ్ళు గృహప్రవేశాలకు సంబంధించి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు డిసెంబరు 15 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు మూడవ వారంలో రాష్ట్రంలో పీఎంఏవై ద్వారా నిర్మించిన లక్ష గహాలు ఒకేసారి ప్రారంభించ నున్నారని, దీనిలో జిల్లాలో 4,452 ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికి 2,400 ఇళ్ళు పూర్తి అయ్యాయన్నారు. వివిధ దశల్లో ఉన్న మిగతా 2,052 ఇళ్ళు నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ లే అవుట్లలో అప్షన్ 3 క్రింద నిర్మిస్తున్న ఇళ్ళు నాణ్యతలో రాజీ లేకుండా నిర్దేశిత మార్గ దర్శకాలు, ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో సక్షమ్ ద్వారా మంజూరు చేసిన మౌలిక సౌకర్యాల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. పనుల పర్యవేక్షణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అవగాహన పెంచా లన్నారు. బాల్యవివాహాలు ప్రయత్నాలు జరిగితే దానిలో బాగస్వాములైన అందరిని బైండోవర్ చేయాలన్నారు. మండల, గ్రామస్థాయిలో బాల్యవివాహాల నివారణ కమిటీ సమావేశాలు సంబంధిత అధికారులతో క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అపార్ ఐడిలు రూపొందించే ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం డిసెంబరు 7వ తేదిన ఘనంగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్సీపీఐ, గహాల జియో ట్యాగింగ్, పీఎం విశ్వకర్మ ధరఖాస్తులు, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై సమీక్షించి తగు సూచనలు చేశారు. సమావేశంలో సీపీఓ శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాదు, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్‌బాబు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, డీఈఓ రేణుకా తదితరులు పాల్గొన్నారు.

నందిగం సురేష్‌కు 16 వరకు రిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి



బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసులు కట్టుదిట్టమైన భద్రత నడుమ సోమ వారం మంగళగిరి కోర్టులో హాజరపరిచారు. వెలగపూడిలో జరిగిన ఎం.మరియమ్మ హత్య కేసులో నిందితుడిగా ఉన్న సురేష్‌ను కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం ఈ నెల 16వ తేదీ వరకు రిమాండ్ విధించింది.

రోడ్డు ప్రమాదంలో పింఛనుదారుడు మృతి

చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన

ప్రజాశక్తి - మేడికొండూరు

అనారోగ్యముతో ఉన్న వ్యక్తి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ప్రభుత్వ పెన్షన్ తీసుకునేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే లారీ కిందపడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని సిరిపురం గ్రామంలోని పెదకూరపాడు రోడ్ లోని రైల్వే గేట్ సమీపంలో సోమవారం జరిగింది. పెదకూరపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాన్ షరీఫ్ జీవనోపాధి కోసం వ్యవసాయ పనులతో పాటు, టైలరింగ్ పనులు కూడా చేసుకుని జీవిస్తుంటాడు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ గుంటూరు ఆసుపత్రిలో డయాలసిస్ వైద్య చికిత్స పొందుతు ప్రభుత్వం పింఛను రూ.15వేలు అందుతుంది. వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుందని ఆసుపత్రి నుంచి పెన్షన్ తీసుకునేందుకు పెదకూరపాడు వచ్చాడు. తిరిగి గుంటూరుకి ద్విచక్ర వాహనం మీద బయలుదేరాడు. మార్గమధ్యలో సిరిపురం రైల్వే గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో షేక్ ఖాసిం షరీఫ్ (49) లారీ చక్రాల కింద పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి భార్య కరీమున్, ఇద్దరు పిల్లలు సాహిదుల్లా, ఆఫ్రిన్ ఉన్నారు. మేడికొండూరు ఎస్సై షేక్ ఖాజీ బాబా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ, డ్రైవర్ క్లీనర్లు పరారీలో ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముక్కోటి ఏకాదశి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జనవరి 10న జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవానికి సంబంధించిన గోడపత్రికలు, ఆహ్వాన పత్రికను మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో వీటిని ఆవిష్కరించి, ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కృష్ణవేణి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ప్రఖ్యాత స్పీకింగ్ ట్రీ కంపెనీ ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు 59 మంది ఉద్యోగాలు సాధించారని కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 147 మంది పాల్గొనగా ఎంపికల్లో ప్రతిభ చాటిన 59 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హుల య్యారన్నారు. ఉద్యో గాలు సాధించిన విద్యార్థులకు శిక్షణా కాలంలో వార్షిక వేతనం రూ 2.50 లక్షలు కంపెనీ ప్రతినిధులు చెల్లించనున్నట్లు కమ్యూనికేషన్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తారని హెచ్ఆర్ సాయికృష్ణ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ఆశ్రమం రోడ్డులోగుట్టు చప్పుడు కాకుండా ఓ అపార్ట్మెంట్లో జరుగుతున్న పేకాట డెన్ పై తాడేపల్లి పోలీసులు సోమవారం రాత్రి పక్క సమాచారంతో దాడి చేశారు. దాడుల్లో మంగళగిరి మండలం కాజా గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు , మాజీ ఎమ్మెల్యే అనుచరుడు బ్రహ్మారెడ్డి తో పాటు 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాడేపల్లి, మంగళగిరి కి చెందిన అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు పలుకుబడి కలిగిన రాజకీయ నేతలు ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా రూ.25300 పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారందరికీ స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు తెలిసింది. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8 మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - నూజెండ్ల

మండలంలోని రవ్వారం వద్ద పేకాట శిబిరంపై ఐనవోలు పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అరెస్ట్ చేశారు. సోమవారం సాయంత్రం వినుకొండ రూరల్ సీఐ బి. ప్రభాకర్ ఆధ్వర్యంలో ఐనవోలు పోలీసులు దాడులు నిర్వహించారు. రవ్వారం కొండ వెనుక డంపింగ్ యార్డులో పేకాట జూదం జరుగుతుందన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారి వద్ద నుండి రూ.1,03,500 నగదు, 8 ద్విచక్ర వాహనాలు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేశామని సీఐ ప్రభాకర్ తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన, జూదాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.




సాయుధ దళాల పతాక నిధికి విరాళాలివ్వండి

పోస్టర్లను, కార్ ఫ్లాగ్స్, స్టిక్కర్లను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలూ విధులను నిర్వర్తిస్తున్న సైనికులకు, మాజీ సైనికుల సంక్షేమం కోసం సాయుధ దళాల పతాక నిధికి ప్రజలు విరాళాలివ్వాలని, ఈ కార్యక్రమంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని పల్నాడు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, పోస్టర్స్, కరపత్రాలను నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. అధికారులకు కరపత్రాలను అందించి, విరాళాల సేకరణకు సహకారాన్ని కోరారు. దేశం కోసం అసువులు బాసిన వీర సైనికులు కుటుంబ సభ్యులు, వితంతువులు దేశ ప్రజల బాధ్యతను ఈ పతాక దినోత్సవం గుర్తు చేస్తుందని అన్నారు. ఆర్మీ, వైమానిక, నౌకాదళాలకు చెందిన సైనికులు అహర్నిశలు దేశం సరిహద్దుల్లో, గగనతలంలో, సముద్రంలో దేశానికి రక్షణగా ఉంటున్నారని, దేశంలోకి శత్రువులు చొరబడకుండా కాపాడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో అసువులుబాసిన వీరసైనికులకు దేశ ప్రజలంతా నివాళులు అర్పించే దినం సాయుధ దళాల దినోత్సవం అని వివరించారు. వరదలు, భూకంపాలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సైతం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనిక దళాలు సహాయ కార్యక్రమాలు చేపడతాయని చెప్పారు. ఇలాంటి సేవలను అందరమూ స్మరించుకోవాలన్నారు.



587.60 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ నీటిమట్ట మట్టం సోమవారం సాయంత్రానికి 587.60 అడుగుల వద్ద ఉంది ఇది 305.8626 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ నుంచి 9104 క్యూసెక్కులు, ఎడమ కాల్వ నుండి 4881 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి నుంచి 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోగా 16385 క్యూసెక్కులు వస్తోంది.

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి- రెంటచింతల : సాగునీటి సంఘాలకు 8న ఎన్నికల నేపథ్యంలోఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు సోమవారం ప్రకటించారు. తుమ్మకోట 2086, పసర్లపాడు 1831, కొత్త పాలువాయి 2379, రెంటాల 2826, రెంటచింతల 1411, మిట్టగుడిపాడు 1792, మొత్తం 12,325 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో 6 సాగునీటి సంఘాలు, 2డీసీలు ఉన్నాయి 2015 సెప్టెంబర్ తర్వాత ఇప్పటి వరకు ఎన్నికలు జరగలేదు.

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలివ్వాలి

ప్రజాశక్తి - రెంటచింతల : మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు రావాల్సిసిన మూడు నెలల బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి తిక్క నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటన డిమాండ్ చేశారు. బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారని, చాలీచాలని వేతనాలతో వారి కుటుంబాలు దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

రైతు గుండెల్లో తుపాను గుబులు

ప్రజాశక్తి - మాచర్ల

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఫెయింజల్ తుపాన్ రైతు పాలిట శాపంలా వెంబడుతోంది. రెండ్రోజులుగా ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడు పడుతున్న చిరు జల్లులు రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. మాచర్ల వ్యవసాయ శాఖ ఎడిఎ కార్యాలయ పరిధిలో 16,700 ఎకరాల్లో వరి సాగవగా ఇందులో 60 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. కోసిన పంట కళ్లాల్లో ఉన్న రైతులు, పంట కోయాల్సిన రైతులు తుపాన్ ప్రభావంతో పెద్ద వర్షాలు పడి పంట తడుస్తుందేమోనని భయపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధర రూ.1,725 ఉన్నా తేమ 16 శాతం లోపే ఉండాలనే నిబంధనా పంట అమ్మకాలకు ఆటంకంగా మారింది. చాలామంది ప్రైవేటు వ్యాపారులకే పంట అమ్మాల్సి వస్తోంది. నిబంధనలు సడలించాలని, తుపాను కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు తేలికపాటి జల్లులే పడుతున్నాయని, అవి పెద్ద ఇబ్బందికరం కాదని, మిగతా పంటలకు సైతం నష్టం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



మాచర్ల మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యంపై పట్టాలు కప్పుతున్న మహిళా రైతు

భార్య, కొడుకులు గెంటేశారు..



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించాలని అధికారులను పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌లో ప్రజల నుండి 66 ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆస్తి, ఆర్థిక వివాదాలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. అర్జీలు రాసేందుకు పోలీసు సిబ్బంది సహకరించగా అర్జీదార్లకు దాతలు భోజనం ఏర్పాటు చేశారు.

చిట్టీ డబ్బులివ్వడం లేదు

పిడుగురాళ్ల పట్టణం లెనిన్ నగర్‌కు చెందిన పోతుల లియమ్మ చిట్టీల కింద రూ.2.20 లక్షలు డబ్బులు కట్టించుకొని సమయం ముగిసి మూడేళ్లవుతున్నా



డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్టు అదే ప్రాంతానికి చెందిన స్వాతి, సాగర్‌కుమారి ఫిర్యాదు చేశారు. డబ్బులు అడిగితే దూషిస్తోందని, పోలీసు లకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని చెప్పారు.

ఇంటి నుండి గెంటేశారు



తనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా వీరిలో కుమార్తెకు, పెద్ద కుమారునికి పెళ్లిళ్ల చేశానని, చిన్న కుమారుడు జులాయిగా తిరుగుతూ వ్యవసనాలకు బానిసై ఇంట్లో డబ్బులు, బంగారం దొంగతనంగా తీసుకువెళ్లి తాకట్టు పెడుతున్నాడని నరసరావుపేట పట్టణం బరంపేటకు చెందిన వాస్తు సిద్ధాంతి చలమయ్య ఫిర్యాదు చేశారు. డబ్బుల దుబారాపై ప్రశ్నిస్తే దూషిస్తున్నాడని, డబ్బులివ్వకపోతే దాడి చేస్తున్నాడని చెప్పారు. భార్య, పిల్లలు కూడా అతనికి ఒత్తాసు పలుకుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు రాసి ఇవ్వాలని భార్య ఇబ్బంది పెడుతోందని, ఇంటి నుండి సైతం కొడుకులు తనను గెంటేశారని వాపోయారు.

కంపెనీ డబ్బు వాడుకుని ఇవ్వడం లేదు

నరసరావుపేట సంగీత్ మొబైల్ స్టోర్ మేనేజర్ జల్ది మహేష్ రూ.1.60 లక్షలు అపహరించినట్లు తేలిందని, ఇదేమని ప్రశ్నిస్తే సొంత అవసరాలకు వాడుకున్నానని 10 రోజుల్లో చెల్లిస్తానని ఒప్పందం చేసుకుని నాలుగు నెలలలైనా చెల్లించలేదని కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ ముల్లా కాలేషా ఫిర్యాదు చేశారు. కంపెనీకి డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన మహేష్ చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించాలని కోరారు.

ఉద్యోగం పేరిట రూ.18 లక్షల టోకరా

పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఆంజనేయులు, అతని స్నేహితులకు కలిసి సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన ఈపూరు మండలం పోనుగోటివారిపాలేనికి గుంటుపల్లి వెంకట మల్లికార్జునరావుకు రూ.18 లక్షలు ఇప్పించారని, 6 నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకుండా, డబ్బులు వెనక్కు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని పిడుగురాళ్లకు చెందిన శివాంజనేయులు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల రిలేదీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇపిఎఫ్, పెయిడ్ హాలిడేస్ తదితర సమస్యలపై విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు స్థానిక టిడ్కో ఇళ్ల వద్దగల డిఇ కార్యాలయం ఎదుట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ (సిఐటియు) టౌన్ 2 డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం రిలేదీక్షలు చేపట్టారు. దీక్షలను యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె.రాజశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ సమస్యల కారణంగా డబ్బుల జమ వాయిదా వేసినట్లు చెప్పిన అధికారులు దీక్షలు చేపట్టాక ఒక సంవత్సరం బకాయిలు జమ చేశారని చెప్పారు. సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులకు ఆరేళ్ల పెయిడ్ హాలిడేస్ డబ్బులు రావాల్సి ఉండగా ఒక్క ఏడాదివి మాత్రమే ఇచ్చారని, మిగతావీ జమ చేయాలని డిమాండ్ చేశారు.



దీక్షల్లో సిహెచ్.అయ్యప్ప, జి.రాంబాబు, కె.బాలగౌతమ్, ఎస్కే.అబ్దుల్ సలాం, హనుమంతరావు, వీరాంజనేయులు, ఎస్.కె. కరిముల్లా, ఎ.వెంకటరావు, ఆర్.నాగరాజు, పి.ప్రసాద్ కూర్చున్నారు.

ట్రేడ్ ఫెయిర్‌లో డ్వాక్రా మహిళకు మొదటి బహుమతి

మంగళగిరికి చెందిన లక్ష్మీ సామ్రాజ్యంకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో జరిగిన 43వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్-2024లో పాల్గొని మొదటి బహుమతి సాధించిన మంగళగిరికి చెందిన లక్ష్మీ సామ్రాజ్యంకు సోమ వారం కలక్టరేట్‌లోని జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ మెమెంటో అందజేశారు. నవంబర్ 14 నుండి 27వ తేదీ వరకూ న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకోవటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి గుంటూరు జిల్లాలోని మంగళగిరి, కొల్లిపర మండలాల నుండి ఇద్దరు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. అందులో మంగళగిరి మండలంలోని స్నేహ మహిళా గ్రూపు సభ్యురాలు జి.లక్ష్మిసామ్రాజ్యం, భర్త మధుబాబు పాల్గొని 15 రోజుల్లో అందరికి కంటే ఎక్కువ అమ్మకాలు చేసినందుకు మొదటి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు , డిఆర్ఓ ఖాజావలి, ఆర్డిఓ కే. శ్రీనివాస రావు , పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి సాధించిన డ్వాక్రా మహిళను అభినందిస్తున్న జిల్లాకలెక్టర్

ఎసిసి భూముల్లో కార్మికుల ఆందోళన

ఇళ్లు కూల్చినా సమస్య పరిష్కరించేవరకూ ఉద్యమిస్తాం

ప్రజాశక్తి-తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం కోసం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు సోమవారం గుడిసెలు పీకివేసిన ఎసిసి భూముల్లో ఆందోళన చేపట్టారు. శనివారం రాత్రి కార్మికులు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ పాకలు కూల్చిన స్థలాన్ని కార్మికులు తిరిగి స్వాధీనం చేసుకోవడం పట్ల అభినందనలు తెలిపారు. అధికారులు కుల్చిన పోరాట శిబిరాన్ని కూడా మరల నూతనంగా ఏర్పాటు చేసుకోవడం పట్ల కార్మికుల పట్టుదలకు నిదర్శనంగా చెప్పారు. అక్రమంగా పేదల గుడిసెలను కుల్చటాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. ఏ ఐ ఎఫ్ టి యు నాయకులు కోటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు ఎన్ని కుయుక్తులు బడిన కార్మికుల పోరాట స్ఫూర్తిని దెబ్బతీయలేదని చెప్పారు. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటానికి తమ యూనియన్ తరపున పూర్తి అండదండలు ఉంటాయని ప్రకటించారు. మంగళగిరి రూరల్ సిపిఎం నాయకులు మొసలి పకీరయ్య దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, శివమ్మ, అమనుల్లా ఖాన్, ఎస్ ఆ రిప్, వి శాస్త్రి, ఎం ఆశీర్వాదం, బి అంకయ్య, సాంబశివరావు, యెహెూషు వ, భాష, రమాదేవి, ఎం శారద, శా రమ్మ , సామ్రాజ్యం, హిమంబి, దుర్గమ్మ, నాని, నాగేశ్వరరావు, ఎం గురవయ్య, సుబ్బారావు, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.



ఆర్టీసీ ఏసీ బస్సుల ఛార్జీల తగ్గింపు

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్టీసి గుంటూరు-2 డిపోనుండి నడుపుతున్న ఏసీ బస్సులకు ఆదివారం తప్ప మిగిలిన అన్ని రోజులలో డిసెంబర్ 1 నుండి 31వ తేదీ వరకూ పలు రూట్లలో తగ్గింపు ధరలు ఇస్తున్నట్లు డిపో మేనేజర్ షేక్. అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలియజేశారు. అమరావతి బస్సుకు బిహెచ్ ఇఎల్ రూట్‌లో 20 శాతం తగ్గింపు రేటు ఇస్తు న్నట్లు చెప్పారు. అంటే రూ.742టికెట్, రూ.593లకే ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇంద్ర బస్సుకు బిహెచ్ఇఎల్ రూట్‌లో 10 శాతం అనగా, రూ.585లకు బదులు, రూ.526లకు, ఇంద్ర బస్సుకు బెంగుళూరు రూట్‌లో రూ.1305 లకు బదులు రూ.1176లు మాత్రమే వసూలు చేస్తున్నట్లు చెప్పారు. కావున ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



విజేతలతో స్కూల్ సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

కెఎల్‌పి స్కూల్లో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక డాక్టర్ కెఎల్‌పి పాఠశాలలో సోమవారం కంప్యూటర్ అక్షరాస్యత దినత్సోవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ రంగం రోజురోజుకూ ఎలా అభివృద్ధి చెందుతుందో వివరించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంచాలని చిన్న తరగతుల నుండే కంప్యూటర్ లాంగ్వేజ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ ఇక్కడ ఇంజినీరింగ్ చదువులో అవసరం అయ్యే పైథాన్ లాంగ్వేజ్‌ను పాఠశాల స్థాయి నుండే పరిచయం చేస్తూ విద్యార్థులు ఉన్నతమైన స్థాయికి చేరుకునేలా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సాంకేతిక, డిజిటల్ రంగం పోకడలు తెలియజేసే రకరకాల నమూనాలతో కంప్యూటర్ విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. అనంతరం పైథాన్ ప్రోగ్రామ్, క్విజ్, డిజిటల్ డ్రాయింగ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు.



యూనివర్సిటీ చెస్ టీంకు 'చలపతి'లో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో ఈనెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనబోయే ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు 1వ తేదీ నుండి నుండి 4వ తేదీ వరకు నిర్వశిస్తున్న శిక్షణా తరగతులు కొనసాగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ప్రారంభించారు. గత నెలలో చలపతి ఫార్మసీ కళాశాల వేదికగా నిర్వహించిన అండర్ యూనివర్సిటీ చదరంగం పోటీలలో గెలుపొంది, సౌత్‌జోన్ పోటీలకు వెళ్లే క్రీడాకారులకు యమ్.గోపీనాథ్ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో జెకెసి కాలేజి నుండి ఎన్. వైష్ణవి, చలపతి ఫార్మసీ కళాశాల నుండి బి.సాయితేజ, బాపట్ల ఇంజినీరింగ్ కాలేజి నుండి ఎన్.మేరీ, సి.హెచ్. అనూష, చలపతి ఫార్మసీ కళాశాల నుండి ఆర్.నాగవైష్ణవి, కె.స్వప్నమాధురి శిక్షణ పొందుతున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి ఆంజనేయులు శుభాకాంక్షలు తెలిపారు.



సెయింట్ ఆన్స్‌లో కాలుష్య నియంత్రణ దినం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో సోమవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాలుష్య నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి, కాలుష్య కారకాలు, రకాలను, నియంత్రణ చర్యల గురించి పోస్టర్ల రూపంలో ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థి నులు గోరంట్ల ప్రాంతంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్ రోజ్, బయో టెక్నాలజీ విభాగాధిపతి కె.వనజ, రంజిత పాల్గొన్నారు.



దేగల ప్రభాకర్‌కు పూలబొకే అందచేస్తున్న భాష్యం ప్రవీణ్

దేగల ప్రభాకర్‌కు ఎమ్మెల్యే ప్రవీణ్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దేగల ప్రభాకర్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్టంలో నూతన పరిశ్రమల ఏర్పాటు, రాష్టం అభివద్ధి పథంలో నడిచేవిధంగా కషి చెయ్యాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆకాంక్షించారు.నూతన పరిశ్రమల ఏర్పాటుకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కషి చేస్తానని ప్రభాకర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో కుర్ర అప్పారావు, మేకల బాబురావు, బొక్కిసం శివరామ్, మేళ్ళం సైదయ్య, రామ్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో అధ్యాపకుల కృషి అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

అధ్యాపకులు విద్యాబోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా సేవలందించే విధంగా కృషి చేయటం అభినందనీయం అని టిజెపియస్ కాలేజి సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో ఎన్ఎస్ఎస్ అధికారిగా ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించినందుకుగాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.విజయలక్ష్మి నుండి పురస్కారం అందుకున్న కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్‌ను సోమవారం కళాశాల సెక్రెటరీ అభినందించారు. రాబోయే కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యస్.అనితాదేవి, కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాం సుందర్, కమిటీ సభ్యులు నాగ సుందరం, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి తదితరులు అభినందించారు.



డాక్టర్ సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న టిజెపిఎస్ కాలేజి సెక్రెటరీ తదితరులు



సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

రాజస్తాన్‌లోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధిదీపాలు, రోడ్లనిర్వహణ, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, ద్రవవ్యర్థాల నిర్వహణ, ఇతర ఉత్తమ పద్ధతుల అధ్యయనానికి రెండ్రోజుల పర్యటనకు వెళ్లిన గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం జైపూర్ డెహ్లావాస్‌లోని 215 ఎంఎల్డీ సామర్థ్యం కల్గిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం ప్లాంట్ పరిసరాలను, ప్లాంట్‌కు సంబందించిన చారిత్రిక మ్యూజియాన్ని సందర్శించారు. మురుగునీటిని శుద్ధి చేసిన తర్వాత పునర్వినియోగం చేసే విధానాన్ని, సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ ఆధారంగా భారతదేశంలో మొట్ట మొదటి బయోగ్యాస్ ప్లాంట్‌ని పరిశీలించారు. మురుగునీటి పంపింగ్ స్టేషన్, ప్రాథమిక చికిత్స యూనిట్లు, స్లడ్జ్ విభజన యూనిట్ల పనితీరుని వివరించారు. సోలార్ పవర్‌ప్లాంట్, సిఎన్‌జి బ్లాటింగ్ పాయింట్‌లను పరిశీలించారు.వీధి దీపాల నిర్వహణను ప్రాజెక్ట్ ఈఈ ప్రదీప్ వివరిస్తూ జైపూర్ నగరంలో 1,19,3333 వీధిలైట్లు ఉన్నాయని, వాటిని 1697 సెంట్రల్ కంట్రోల్ మానిటరింగ్ సిస్టం ద్వారా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. అలాగే గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జిటిఎస్) కేంద్రాలను, చెత్తను అధునాతన విధానంలో మెకానికల్ కన్వేయర్ బెల్ట్ ద్వారా తడి, పొడిగా వేరు చేయడాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ వ్యర్ధాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రానికి వ్యర్థాలను తరలించే తీరు, వసూళ్ల చేస్తున్న చార్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు టీడీపీ నాయకులు సోమవారం ఉదయం అందించారు. ఎర్రబాలెం గ్రామానికి చెందిన గడ్డం నాగమల్లేశ్వరికి రూ. 37,539, బీమా పద్మావతికి రూ. 69,782 సీఎం సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోటపార్థసారథి, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టిడిపి నాయకులు మల్లవరపు వెంకట్, ఈపూరి పెద్దబ్బాయి, నీలం అంకారావు, ఆకుల పానకాలరావు తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థులతో ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులు

మెరిట్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక మారిస్ పేట నల్లమోతు చెంచు రామానాయుడు పురపాలక ఉన్నత పాఠశాలలో 1979-80 సంవత్సరంలో పదవ తరగతి పూర్వ విద్యార్థులు ప్రస్తుతం పాఠశాలలోని మెరిట్ విద్యార్థులకు సిల్వర్ మెడల్స్ బహూకరించారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయని పివి సుధారాణి మాట్లాడుతూ 2012 నుండి ప్రతి సంవత్సరం ఈ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు, విద్యార్థులకు వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తూ చదువుకున్న పాఠశాల పై ప్రేమాభిమానాలను కలిగి ఉండడం అభినందనీయమన్నారు. అప్పటి బ్యాచ్ ఎస్పిఎల్ శివప్రసాద్ మాట్లాడుతూ స్నేహం విలువను చాటే విధంగా ప్రతిఏటా పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం 9,10 తరగతుల్లో ఫార్మేటివ్ 1, 2 పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు, అలాగే చక్కని హ్యాండ్ రైటింగ్ కలిగిన విద్యార్థినికి సిల్వర్ మెడల్, ప్రశంస పత్రంతో సత్కరించి అభినందించామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రకాష్, అహ్మద్ షరీఫ్, శ్రీనివాసరావు, పోలేరమ్మ, భూలక్ష్మి, రాజేశ్వరరావు, హనుమంతరావు, చలమయ్య, రమణబాబు, ఇజ్రా, వెంకటరెడ్డి, కరీముల్లా, వాసు,పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సిఆర్పి శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతల రహిత రహదారులే ప్రభుత్వ లక్ష్యం

- రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు కృషి
- మంత్రి జనార్ధనరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవననాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గుంతల రహిత రహదారులే లక్ష్యంగా జరుగుతున్న మరమ్మతు పనులను ఆయన తనిఖీ చేశారు. సోమవారం నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం వద్ద రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని స్పష్టం చేశారు. రోడ్ల మరమ్మతులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని.. క్షేత్రస్థాయిలో అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సాయంతో రాష్ట్రంలో దాదాపు రూ.76 వేల కోట్లతో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నరసరావుపేట - చిలకలూరిపేట రోడ్డు నాలుగు లైన్లుగా మార్చేందుకు చర్యలు

చిలకలూరిపేట నియోజకవర్గంలోని నరసరావుపేట - చిలకలూరిపేట రోడ్డును మంత్రి పరిశీలించారు. అనంతరం స్థానిక యడవల్లి గ్రామ టీడీపీకార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. స్థానిక ప్రజలు నరసరావుపేట - చిలకలూరిపేట రోడ్డు విస్తరణపై మంత్రి దష్టికి తీసుకురాగా.. అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిలకలూరిపేటలో నియోజకవర్గంలో రూ.5 కోట్లతో 19 కిలోమీటర్ల మేర 18 పనులను చేపట్టామన్నారు. ప్రస్తుతం నరసరావుపేట - చిలకలూరిపేట మధ్య ఉన్న రోడ్డును 4 లైన్ల రహదారిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధం చేసిందన్నారు. నరసరావుపేట - చిలకలూరిపేట మార్గం రాయలసీమ వాసులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దీని వల్ల రాయలసీమకు దూరం కూడా తగ్గుతుందన్నారు. ఆధ్యాత్మిక కేంద్రం కోటప్పకొండకు వచ్చే భక్తులను దష్టిలో పెట్టుకుని కూడా ఈ రోడ్డును అభివద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మార్గంలో ట్రాఫిక్ పెరగడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఆయన వెంట ఆర్డీఓ కె.మధులత, ఆర్అండ్బీ ఈఈ రాజా నాయక్, డీఈఈ నరేందర్ రెడ్డి, ఏఈలు గణేష్ కుమార్, తహశీల్దార్ కె.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.




రహదారి మరమ్మతు పనులపై చర్చిస్తున్న మంత్రి

జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు మండాది విద్యార్థి

అభినందించిన ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి- వెల్దుర్తి

68వ జాతీయస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు వెల్దుర్తి మండలం మండాది గ్రామం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి కాండ్రకొండ యువరాజ్ శేఖర్ విద్యార్థి ఎంపికయ్యాడు. ఈ నెల 10 నుంచి 14 వరకు వారణాసిలో జరిగే పోటీల్లో శేఖర్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా సోమవారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులతో కలసి మర్యాదపూర్వకంగా కలిశాడు. విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే.. విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగరాజకుమారి, టీడీపీ నాయకులు రాజబోయిన మధు యాదవ్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.వేణుగోపాల్, ఆంజనేయులు, అరుణ, కష్ణమూర్తి, కేశవరావు, మల్లేశ్వరి బాయి పాల్గొన్నారు.



విద్యార్థి శేఖర్ను అభినందిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

పచ్చదనం- పరిశుభ్రతకు ప్రాధాన్యం

- వినుకొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన చీఫ్విప్ జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రమంతటా పచ్చదనం-పరిశుభ్రత ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఇందులో భాగంగా పట్టణాలు, పల్లెల్లో పెద్దఎత్తున సీసీ రహదారులు, కాలువలు, వ్యర్థాల నుంచి సంపదసష్టి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వినుకొండ మార్కాపురం రహదారిలోని 15వ వార్డులో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి మంజూరైన రూ.13.71 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చెత్త మీద పన్నువేసిన వైసీపీ.. చెత్త ప్రభుత్వంగా పేరు సంపాదించుకుందన్నారు. వినుకొండలో ఎక్కడా చెత్త, మురుగు కనిపించడానికి వీల్లేదన్నారు. చెత్త కనిపిస్తే తీసుకెళ్లి సంపద సష్టించాలని అధికారులకు సూచించారు. వినుకొండ నియోజవర్గంలో ఎస్టీ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం కోసం కూడా ఇటీవలే ముఖ్యమంత్రి రూ.2కోట్ల నిధులు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్ఎస్పీ కాలనీ మైదానంలో పార్కు, స్టేడియం, టీటీడీ కళ్యాణ మండపం, షాదీఖానా, ఎస్సీ భవన్ నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, వార్డు కౌన్సిలర్ పీవీ సురేష్ బాబు, జనసేన ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సౌదగర్ జానీబాషా, జానీ, సుభానీ పఠాన్, చికెన్ బాబు, గంధం సుబ్బారావు, అడుసుమిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

శ్రీరామప్ప ఆలయంలో భారీగా అన్నప్రసాద పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

కార్తీక మాస ప్రత్యేక పూజలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ గంగా పర్వతవర్ధనీ సమేత చింతల రామలింగేశ్వర స్వామి దేవాలయం(శ్రీరామప్ప)లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఐదు వేల మంది భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ గావించారు. కంభంపాటి యల్లమంద, పోలిశెట్టి చంద్రశేఖరరావు, షరాబు వెంకటరత్నం, పోలిశెట్టి లక్ష్మీనారాయణ, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

చిన్నమసీదు నిర్మాణ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో మస్జిద్-ఎ-బిలాల్-హుదా (చిన్న మసీదు)పున్ణనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముస్లిం పెద్ద మత పెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. కార్యక్రమం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరు శాంతి కాలనీలో అన్నదానం

ప్రజాశక్తి - పెదకూరపాడు

వివిధ ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని వృథాగా పారబోయవద్దని జనచైతన్య సమితి ప్రతినిధులు కోరారు. తమకు సమాచారం అందిస్తే, తీసుకెళ్లి నిరుపేదలకు అందజేస్తామని చెప్పారు. అమరావతి మండలంలోని మండేపూడి గ్రామ గంగా భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం మహా అన్నదాన ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఇక్కడ మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఆలయ కమిటీ పెద్దలు మంగళగిరి లక్ష్మీపతి జన చైతన్య సమితి ద్వారా పెదకూరపాడు మండలంలోనితాళ్లూరు శాంతి కాలనీలో గల బేడబుడగ జంగాల కాలనీలో పేదలకు పంపిణీ చేశారు.



శాఖమూరి పేరయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-ఈపూరు

ఇనిమెళ్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి శాఖమూరి పేరయ్య కషి చేశారని ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఇనిమెళ్ల గ్రామంలో సోమవారం శాఖమూరి పేరయ్య విగ్రహాన్ని ఆంజనేయులుతోపాటు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పేరయ్య చేసిన కృషిని వివరించారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, వైద్యులు గోనుగుంట్ల శ్రీనివాసరావు, నాయకులు శాఖమూరి రామ్మూర్తి, వీరయ్య, పాలగని రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పీఎస్ఆర్ ఆంజనేయులుకు సత్కారం

పీఎస్ఆర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మీనాక్షి నేత్ర వైద్యశాల వ్యవస్థాపకులు పి.ఎస్.ఆర్ ఆంజనేయులు సేవలు అభినందనీయమని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం పట్టణంలోని పి.ఎస్.ఆర్ కంటి వైద్యశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతం అమతలూరుకు చెందిన పి.ఎస్.ఆర్ ఆంజనేయులు వైద్య రీత్యా అమెరికాలో స్థిరపడ్డారని... ఎంతో వెనుకబడి ఉన్న పల్నాడు ప్రాంతంలో పలుమార్లు ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించారని తెలిపారు. మీనాక్షి కంటి వైద్యశాలలో ఏడాదికి సుమారు 5 వేల మందికిఉచితంగా కంటి శుక్లాలకు వైద్యం చేస్తున్నట్లు చెప్పారు. స్వలాభాన్ని మరిచి పేద ప్రజల కోసం నిత్యం పాటుపడే ఆంజనేయులు లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పి.ఎస్.ఆర్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, సంతోష్, ప్రసాద్, శ్రీనివాసరావు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



బెల్ట్ షాపులు నిర్వహిస్తే లైసెన్సు రద్దు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బెల్ట్ దుకాణాలు నిర్వహించినా, ప్రోత్సహించినా లైసెన్సును రద్దు చేస్తామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.విజయ్కుమార్ మద్యం దుకాణదారులను ఆదేశించారు. సోమవారం మద్యం దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరిష్ట చిల్లర ధరకే మద్యాన్ని విక్రయించాలని స్పష్టం చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సత్తెనపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

అమరావతి వైపే ప్రభుత్వం మొగ్గ

గణతంత్ర వేడుకలు ఇక్కడే నిర్వహించేందుకు సన్నాహాలు!

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో జనవరి 26న గణతంత్ర వేడుకలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు కనిపిస్తోంది. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి వద్ద వేడుకలు జరిపేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాయపూడి వద్ద ఎన్‌ఆర్‌టీ(నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) ఐకాన్ టవర్ నిర్మాణానికి గతంలోనే నాటి టీడీపీ ప్రభుత్వం భూమిని కేటాయించింది. 2018 జూన్ 22న ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎన్‌ఆర్‌టీ ఐకాన్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఐకాన్ టవర్ నిర్మాణం ఊసే లేకుండా పోయింది. దీంతో సదరు స్థలంలో పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇక్కడ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలని దాదాపు నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఇప్పటికే ఈ స్థలాన్ని, పరిసరాలు, రహదారులను పరిశీలించారు. అనంతరం భూమిని చదును చేయించారు. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో స్పష్టత వస్తే పనులు ముమ్మర మవుతాయని అంటున్నారు. సీఆర్‌డీఏ అధికారులు రాయపూడి వచ్చి మ్యాపుల ద్వారా స్థలం, రోడ్లతోపాటు పలు అంశాలను పరిశీలిస్తున్నారు.



చదును చేసిన ఎన్‌ఆర్‌టి స్థలం

తేమశాతం నిబంధనలను సడలించాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

తేమ శాతం నిబంధనలను సడలించి, రైతులను ఆదుకోవాలని ప్రజాసంఘాలు నాయకులు కోరారు. సోమవారం దుగ్గిరాల మండల డిప్యూటీ తహసీల్దార్ దుర్గకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలకు వరి పంట దెబ్బతిని, దిగుబడి తగ్గిపోయిందని చెప్పారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల కారణంగా.. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. విధి లేక తక్కువ ధరకే ప్రైవేట్ వర్తకులకు విక్రయిస్తున్నారని చెప్పారు. 75 కేజీల బస్తా రూ.1,350కే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని వివరించారు. డీఏపీ, యూరియాలను సొసైటీలు, మార్కెట్ యార్డుల ద్వారా సకాలంలో రైతులకు అందజేయాలని కోరారు. మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న విత్తనాలను రాయితీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎన్.యోగేశ్వరరావు, వై.భీమేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అటవీ ప్రాంతాలపై విశ్వవిద్యాలయ విద్యార్థుల అధ్యయనం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎమ్మెస్సీ అటవీ విభాగం విద్యార్థులు ఫారెస్ట్ స్టడీ టూర్ ను పూర్తి చేశారు. ప్రకతి పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ అవగాహన పెంపొందించడానికి ఈ స్టడీ టూర్ ఎంతగానో దోహదపడుతుందని విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. విద్యార్థులకు అరణ్య పరిసరాలు, వాటి సంరక్షణ, వన్యప్రాణుల జీవన విధానం, మానవ సంబంధాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. వివిధ అరణ్య ప్రాంతాలను సందర్శించి, అక్కడి పరిశోధనలు, పర్యావరణ సంరక్షణ చర్యలు, జంతు సంరక్షణ, హైటెక్ నర్సరీలు, ఎకో టూరిజం వంటి అంశాలను అధ్యయనం చేశారు. ఈ అనుభవం విద్యార్థులకు ప్రకతి మార్పులు, పర్యావరణ రక్షణ విధానాలు, సమగ్ర జంతు సంరక్షణపై కొత్త అవగాహనను అందించినట్లు చెప్పారు. రాజమహేంద్రవరం, రంపచోడవరం మారేడుమిల్లి, సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లను సందర్శించినట్లు తెలిపారు.



స్టడీ టూర్‌లో పాల్గొన్న విశ్వవిద్యాలయ విద్యార్థులు

మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ కుటుంబీకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ సోమవారం నాటికి 48వ రోజుకు చేరుకుంది ప్రకాశం జిల్లా దరిమడుగు గ్రామంలో 13.70 ఎకరాలను మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, అతని తమ్ముడు సతీష్ ఆక్రమించి ఇంజినీరింగ్ కళాశాలను నిర్మించారని.. తగు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని దర్శికి చెందిన బి.వెంకట రామానుజులురెడ్డి, కేసరి రంగ లక్ష్మమ్మ తదితరులు ఫిర్యాదు చేశారు. సత్యసాయి జిల్లా తుపల్లికి చెందిన సి.అమ్మాజీ.. తాను పులివెందులకు చెందిన షేక్ సాయి అనే వ్యక్తికి రూ.40 లక్షలు అప్పుగా ఇచ్చానని తెలిపింది. డబ్బులు అడిగితే వేధింపులతోపాటు బెదిరింపులకు దిగుతున్నారని వాపోయింది. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 1,800 మందికి ఏడు నెలల నుంచి జీతాలు అందడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. వేతనాలు అందించడంతోపాటు.. సర్వీసును రెగ్యులర్ చేయాలని కోరారు. సౌదీ అరేబియాలో అక్రమ నిర్బంధానికి గురైన తన భర్త ఎస్కే ఇస్మాయిల్‌ను విడిపించి, స్వదేశానికి రప్పించాలని ఏలూరు జిల్లా తంగెళ్లమూడి గ్రామానికి చెందిన ఎస్కే నగీన వినతి పత్రం అందజేశారు.



వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేష్



పంట పొలాల్లో పందుల సంచారం

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద సమీపంలోని పలువురు రైతులకు చెందిన సుమారు 170 ఎకరాల్లో పందుల సంచారం అధికమైంది. వరి పంటను తీవ్రంగా నష్టపరచడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో పందులు తీవ్ర కష్టం కలిగిస్తున్నాయని వాపోతున్నారు. అధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల పెంపకందారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని తాడేపల్లి, ఉండవల్లి రైతులు కోరుతున్నారు.



ప్రకృతిని కాపాడటం అందరి బాధ్యత

ప్రజాశక్తి-గుంటూరు

ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని గుంటూరు రీజనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎండి.నజీనా బేగం అన్నారు. చిప్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నివారణ దినం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నజీనా మాట్లాడుతూ భోపాల్ గ్యాస్ దుర్ఘటన సమయంలో జరిగిన నష్టాన్ని వివరించారు. నెలలో ఒకరోజు ప్రకృతిహితమైన కార్యక్రమాల్లో పాల్గొని పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు.

వర్సిటీ అధికారులను కలిసిన వికాస నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఉద్యోగ సంఘం వికాస నూతన కార్యవర్గం సోమవారం వర్సిటీ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసింది. వికాస సంఘం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. వర్సిటీ అభివద్ధిలో ఉద్యోగులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీలపు ప్రసాద్, ఉపాధ్యక్షుడు దాసరి విజయ ప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, తోట వెంకటేష్, నేలపాటి నాగేశ్వరరావు, కోశాధికారి కొలికపూడి యేషయ్య, కార్యవర్గ సభ్యులు చిమట ఆనంద్ కుమార్, పి.నాగరాజు, సీహెచ్ సాంబశివరావు, కేతావత్ శశిధర్, జి.శ్రీను, నల్లగుర్ల శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, టంకశాల వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ రాధిక

పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెనాలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. సోమవారం 24వ వార్డులో కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్యతో కలసి పర్యటించారు. పారిశుధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురపాలికలో వస్తున్న ఫిర్యాదులపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి శుభ్రతతోపాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కమిషనర్ ఎ.ఎం.లక్ష్మీపతిరావు, ఎంహెచ్ఓ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఎం.సాంబశివరావు, సహాయ ఇంజినీర్ బి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భానుమతి

ఎయిడ్స్ రోగులపై వివక్ష తగదు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని రెడ్‌క్రాస్ తెనాలి ఉప శాఖ ఛైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ డే సందర్భంగా తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు నియమాలను ప్రభుత్వ వైద్యులు రమ్యకష్ణ, స్నేహ వివరించారు. ఈ సందర్భంగా భానుమతి మాట్లాడుతూ రోగుల పట్ల సేవాదృకృథంతో మెలగాలని కోరారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రిస్టోఫర్, ప్రేమ జ్యోతి, వరలక్ష్మి, రత్నకుమారి, ఎన్.శ్రీమన్నారాయణ మూర్తి పాల్గొన్నారు.



వృద్ధులు, పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విశ్రాంత హిందీఉపాధ్యాయిని తురిమెళ్ల అనసూయమ్మ ప్రథమ వర్ధంతి సభను తెనాలిలో సోమవారం నిర్వహించారు. పినపాడులో సుమారు వంద మంది అనాథ వృద్ధులు, పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెరుకుపల్లి నాగర్జున కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కారుమంచి రవికుమార్, ప్రముఖ న్యాయవాది పిల్లి విద్యా సాగర్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, అడపాల నాగేశ్వరరావు, తురిమెళ్ల మోహనరావు తదితరులు పాల్గొని విద్యారంగంలో అనసూయమ్మ సేవలను గుర్తు చేసుకున్నారు.

ఆలిండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు హైమావతి ఎంపిక

ప్రజాశక్తి- మాచర్ల

ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మాచర్ల పట్టణానికి చెందిన ఇందుకూరి హైమావతి ఎంపికయ్యారు. గత నెల 27వ తేదీన నాగార్జున యూనివర్సిటీలో జరిగిన సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో హైమావతి మూడో స్థానంలో నిలిచి పతకాన్ని సాధించారు. మాచర్ల పట్టణంలోని హనుమాన్ జిమ్‌లో కోచింగ్ తీసుకుంటున్న హైమావతిని సోమవారం పలువురు అభినందించారు. జిమ్‌కోచ్‌లు రామంటి ఆదివిష్ణు యాదవ్, షేక్ గౌస్‌మోహీద్దీన్, వెయిట్ లిఫ్టింగ్ కోట్ శివకేశవయాదవ్, గాదె శ్రీనివాసరావు, గోగుల అంజిరెడ్డి, పులుసు రఘునాథరెడ్డి, పోకల వెంకటేశ్వర్లు హైమావతికి అభినందనలు తెలిపారు.


పతకం సాధించిన హైమావతి

చలపతి కాలేజి అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజి, ఇసిఇ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ యన్.నందప్రకాష్‌కు కెఎల్ యూనివర్సిటీ పిహెచ్‌డి పట్టా అందించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ తెలిపారు. నందప్రకాష్ 'ఆటోమేటిడ్ లివర్ సెగ్మెంటేషన్ అండ్ ట్యూమర్ డిటెక్షన్ యూజింగ్ డీప్ లెర్నింగ్ ఫ్రమ్ వర్క్ ఇన్ 2డి అండ్ 3డి సిటీ ఇమేజెస్' అనే అశంపై ప్రొఫెసర్ ఉల్లంకి రాజేష్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా నందప్రకాష్‌కు చలపతి విద్యా సంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ వెంకటరామారావు, డీన్ జె.లక్ష్మీనారాయణ అభినందనలు తెలియజేశారు.





సైనికుల కుటుంబాలకు అండగా నిలవాలి

ప్రజాశక్తి-గుంటూరు

సైనికుల కుటుంబాలను ఆదుకునేందుకు డిసెంబర్ 7న జరిగే ఫ్లాగ్‌డే సందర్భంగా సేకరించే విరాళాల ప్రక్రియలో భాగంగా జిల్లా సైనిక సంక్షేమ శాఖ రూపొందించిన స్టిక్కర్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ , సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశభద్రత కోసం ప్రాణాలు అర్పించిన వీరజవానుల కుటుంబ సభ్యులకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా సైనికసంక్షేమ అధికారిణి గుణశీల ఈనెల 7న దేశవ్యాప్తంగా జరుపుకునే ఫ్లాగ్‌డే విశిష్టతను వివరించారు.దేశ రక్షణలో అశువులుబాసిన వీర జవానుల కుటుంబ సంక్షేమం, పునరావాస కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా విరాళాలు సేకరించడం కోసం ప్రతి ఏడాదిలాగే స్టిక్కర్లను రూపొందించి వాటిని స్వచ్ఛంధ సంస్థలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక వేత్తలు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి అందించి విరాళాలు సైనిక సంక్షేమ పద్దుకు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా దేశ సరిహద్దుల్లో మంచు కొండలలో క్లిష్ట వాతావరణంలో పహారా కాసే సైనికులు, దేశ అంతర్గత , విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించే వీడియో చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో సిపిఒ శేషశ్రీ , డీఆర్డీఏ , డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు విజయలక్ష్మీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 153 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు గ్రీవెన్స్‌లో అందచేసిన ఫిర్యాదులను సక్రమంగా పరిష్కరించకుంటే క్షేత్ర స్థాయి అధికారితో పాటు సంబంధిత జిల్లా అధికారికి కూడా మెమోలు జారీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ ఏ.భార్గవ్‌తేజ, డిఆర్‌ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, గుంటూరు ఆర్డీఓ కే.శ్రీనివాసరావు ప్రజల నుండి 153 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో సిపిఒ శేషశ్రీ, డీఆర్డీఏ , డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు విజయలక్ష్మీ, శంకర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ఇసుక క్వారీల్లో సీరియల్ పాటించాలి

ఇసుక క్వారీల్లో లారీ టిప్పర్లకు ఇసుక లోడ్ చేయకుండా, కాంట్రాక్టర్లు తమ సొంత వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారని, తమ పొట్ట గొడుతున్నారని ది ఆంధ్ర రాష్ట్ర టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రెటరీ ఎన్.ఫణికుమార్, ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి ఉచిత ఇసుక విధానం అమలు కావట్లేదని, క్వారీ కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మకయ్యారన్నారు. ప్రభుత్వం ఇసుక లోడింగ్ టన్నుకు రూ.130లు తీసుకోమంటే, క్వారీల్లో రూ.350ల నుండి రూ.400ల వరకూ తీసుకుంటున్నారన్నారు. వాహనాలకు సీరియల్ పాటించట్లేదన్నారు. క్వారీ కాంట్రాక్టర్లు వారి సొంత వాహనాలకు ప్రాధాన్యత ఇస్తూ రాత్రి వేళ లోడింగ్ చేస్తున్నారని, బిల్లులు కూడా లేకుండా యధేచ్ఛగా ఓవర్‌లోడింగ్ చేస్తున్నారన్నారు.అధికారుల పర్యవేక్షణ కూడా లేదన్నారు. పగలు డంపింగ్ పేరుతో టిప్పర్లకు లోడింగ్ చేయట్లేదని, రాత్రి వేళ వారి సొంత వాహనాలకు లోడింగ్ చేస్తున్నారన్నారు. పది టైర్ల వాహనం ఓవర్‌లోడింగ్‌కు రూ.10వేలు, పాసింగ్ లోడ్‌కు రూ.7500లు, స్థానిక వాహనాలకు రూ.5వేలు వసూలు చేస్తున్నారన్నారు. దీంతో వేలాది మంది టిప్పర్ డ్రైవర్లు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నామని, వందల కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని తెలిపారు. అర్జీ ఇచ్చిన వారిలో కె.వెంకటేష్, ఎస్.కె.సుభాని, జె.మాలకొండరాయుడు, యం.రాంబాబు తదితరున్నారు.




అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్

జిఎంసి గ్రీవెన్స్‌కు 43 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి గ్రీవెన్స్‌లో అందిన అర్జీలను సమగ్రంగా పరిశీలించి, పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిఎంసి ప్రధాన కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్ ద్వారా అర్జీలు ఈ స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఫోన్‌లో 15 ఫిర్యాదులు, అనంతరం గ్రీవెన్స్‌లో ప్రజల నుండి 28 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యలను స్థానికంగానే పరిష్కారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో ఆరు అర్జీలు

ప్రజాశక్తి తెనాలి రూరల్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. రెవెన్యూ పరమైన సమస్యలు 3, మున్సిపాలిటీకి సంబంధించి 2, పంచాయతీ, పోలీస్ 1 మొత్తం ఆరు అర్జీలు స్వీకరించినట్లు తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒ కిరణ్మయి వివరాలు వెల్లడించారు.

ఉపాధ్యాయుల పోరాట గొంతుక యుటిఎఫ్

స్వర్ణోత్సవ మహాసభలో పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యుటిఎఫ్ ఏర్పడి 5 దశాబ్దాలు పూర్తి చేసుకొని స్వర్ణోత్సవాలు జరుపు కోవడం హర్షణీయమని ఈ 50 ఏళ్ల కాలంలో ఉపాధ్యాయులకు అనేక హక్కులు, సౌకర్యాలు సాధించేందుకు యుటిఎఫ్ ఎంతో కృషి చేసిందని యుటిఎఫ్ పల్నాడు జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీనివాస రెడ్డి, ఎం.మోహన్‌రావు అన్నారు. ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సంబరాలు, జిల్లా మహాసభలు ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో జరిగాయి. సమావేశాల అనంతరం పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నిక కమిటీకి రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎన్. కుమార్ రాజా, ఎన్నికల పరిశీలకులుగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజీ శ్రీనివాసరావు వ్యవహరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె శ్రీనివాసరెడ్డి, ఎం మోహనరావు, గౌరవాధ్యక్షులుగా షేక్ ఖాసిం పీరా, సహాధ్యక్షులుగా జె.వాల్యా నాయక్, ఏ.భాగేశ్వరీదేవి, కోశాధికారిగా ఎం.రవిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా వి.నాగేశ్వరరావు, బి.నరసింహారెడ్డి, కె.తిరుపతిస్వామి, చిన్నం.శ్రీనివాసరావు, షేక్. జమాల్, టి.అరుణ్ కుమార్, ఎ.నాసరరెడ్డి, జి.విజయ కమల, కె.ఉషాశౌరి రాణి, ఎ.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, కె.ప్రకాశరావు, ఆడిట్ కమిటి జిల్లా కన్వీనర్‌గా ఆర్.అజయ్ కుమార్, సభ్యులుగా డి.కిషోర్ కుమార్, వి.జె.వి. రాజ్ కుమార్,గొడుగు ఆంజనేయులు, షేక్ జిలానీ, రాష్ట్ర కౌన్సిలర్లుగా పి.ప్రేమ్ కుమార్, డివి.లింగయ్య, ఎన్.సుందరరావు, షేక్ ఆయేషా సుల్తానా ఎన్నికయ్యారు.


యుటిఎఫ్ పల్నాడు జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

యుటిఎఫ్ జిల్లా మహాసభలో

పలు తీర్మానాలు ఆమోదం

జి.ఒ117 రద్దు చేసి పాఠశాలల విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, బోధనా సమయాన్ని హరించి వేస్తున్న యాప్‌ల భారాన్ని తొలగించి బోధనకు పరిమితం చేయాలని, సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పిఎఫ్ ఏపీ జిఎల్ఐ మెడికల్ రియంబర్స్మెంట్ సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పోస్టులను అప్ గ్రేడ్ వెంటనే చేపట్టాలని, నెలవారీ ప్రమోషన్లకై తగిన చర్యలు తీసుకోవాలని తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో బోధనను కొనసాగించాలని, క్రొత్త పిఆర్సీ కమిషన్‌ను ఏర్పాటుచేసి తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలని, 11వ పి.ఆర్.సి బకాయిలు పెండింగ్, డిఎలను విడుదల చేయాలని ప్లస్ 2 పాఠశాలలలో బోధన మరియు భోధనేతర సిబ్బందిని నియమించాలని తీర్మానం చేశారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

27, 28 తేదీల్లో ఆర్‌విఆర్ లో కొలరిడో

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో 'కొలరిడో-2024' పేరుతో డిసెంబర్ 27, 28 తేదీల్లో సాంస్కృతిక, సాంకేతిక, క్రీడా విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం కొలరిడో పోస్టర్ ఆవిష్కరించి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పోస్టర్‌ను రాయపాటి శ్రీనివాస్, కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ కళాశాల సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.5 లక్షల విలువైన బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు **http//rvrjcve.ac.in/colori-do2024/** వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలియజేశారు. కార్యక్రమంలో కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ పొన్నం కిషోర్‌పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల అధ్యక్షులు, సెక్రెటరీ తదితరులు

పోస్టల్ ఉద్యోగాల కోసం దళారుల మాటలు నమ్మొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

తపాలా శాఖలో ఉద్యోగాలు విషయంలో అభ్యర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, తపాలా శాఖ ఉద్యోగాలు ఆన్‌లైన్ పద్ధతిలో మాత్రమే ఇస్తారని గుంటూరు డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు హెడ్ పోస్టాఫీసులో పోస్ట్‌మ్యాన్‌గా ఉన్న నాగార్జున గత కొంతకాలంగా విధులకు హాజరు కావట్లేదని, ఈ వ్యక్తి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పోస్టు ఆఫీసుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రజలను మోసం చేస్తున్నాడని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎంతో పారదర్శకంగా నియామకాలు జరుగుతాయని, దళారీ మాధ్యమాల ద్వారా ఎవ్వరికీ ఇవ్వబడవు అని చెప్పారు. గ్రామీణ తపాలా ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు http//indiapostgdsonline.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖాళీల వివరాలు, డాక్యుమెంట్ల అప్‌లోడ్ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థి స్వయంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కావున అభ్యర్థులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే వెంటనే 0863-2255977 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.